# సిద్ధిపేట తరహాలో జనగామ అభివృద్ధి



జనగామ : వృద్ధురాలిని ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి


- జిల్లా కేంద్రం రూపురేఖలు మారుస్తా
- ఆశీర్వదిస్తే అందరివాడిగా పనిచేస్తా
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతం
- మోసగాళ్లను నమ్మితే గోస పడతాం
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామ పట్టణంలో పల్లా ఇంటింటి ప్రచారం

జనగామ, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ) : అభివృద్ధి.. ఆహ్లాదం.. సుందరీకరణలో సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ తరహాలో జనగామ పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని, ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే జిల్లా కేంద్రం రూపురేఖలు మారుస్తానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ మున్సిపల్ పరిధిలోని 20, 21, 22, 28, 29, 30 వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఆయా వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు జూకంటి లక్ష్మి, కర్రె శ్రీనివాస్, మహ్మద్ సమద్, ముస్త్యాల దయాకర్, బొట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పల్లాకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఇండ్ల ముందు జై బీఆర్ఎస్.. జైజై కేసీఆర్.. జై పల్లా అంటూ ముగ్గులు వేసి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాడవాడలా కలియతిరిగిన పల్లాకు బోనాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు దగ్గరగా ఉండే తనకు జనగామ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే అందరివాడిగా పనిచేస్తానని, జనగామకు పెద్ద పాలేరుగా ఉంటానని తెలిపారు. జనగామ పట్టణానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తన తొలి ఎజెండా అంశంగా పేర్కొన్నారు. పెద్దసారు కేసీఆర్ నా మీద నమ్మకంతో జనగామ అభ్యర్థిగా వెళ్లమన్నప్పుడు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు వెళ్తే అందరూ ఆశీర్వదించారన్నారు. నా ముఖం తెల్వకపోయినా ప్రేమ, ఆప్యాయతతో స్వీకరిస్తున్నందుకు మీ అందరికీ శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కేసీఆర్ గులాబీ జెండా ఎత్తిన నాడు కూడా సిద్దిపేటకు ఆనుకొని ఉన్న జనగామ మీ వెంట నడిచిందని తెలిపారు. జనగామకు మెడికల్ కాలేజీ ఇచ్చారని, దానితోపాటు నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కాలేజీ సాధించుకుందామన్నారు. జనగామలో నీళ్లు వస్తున్నాయి కానీ, వాటిని తాగునీళ్లుగా భావించి ఎవరూ తాగడం లేదన్నారు. చీటకోడూరు రిజర్వాయర్‌ను బాగుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందుతున్న జనగామకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రంగప్ప చెరువు అభివృద్ధి, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్, డీసీపీ ఆఫీసు, స్పోర్ట్ స్టేడియం, కళాభవనం కావాలని, బచ్చన్నపేట, చేర్యాల, నర్మెటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ సాధిస్తానని తెలిపారు. జనగామ యువత కోసం ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తానని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు జనగామను బంగారు తునకగా మారుస్తానని హామీ ఇచ్చారు. సారు ఆశీర్వదించి పంపించారు.. ప్రజలు కారుగుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే జనగామ నియోజకవర్గానికి పెద్ద పాలేరుగా పనిచేస్తానని తెలిపారు.

**కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతం..**

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైపోతమని.. పొరపాటున ఆ మోసగాళ్లను నమ్మితే గోస పడాల్సి వస్తుందని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రైతుబంధు సాయాన్ని నిలిపివేయాలని ఆ పార్టీ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేశారంటే కాంగ్రెస్‌కు రైతులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ఆగం కావొద్దని, కాంగ్రెస్ సెక్యులర్ పేరుతో ముస్లిం ఓట్లు దండుకుని అభివృద్ధిని విస్మరించిందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలను కర్ణాటకలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. ఆయన పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రామ్‌ప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, మహిళా, నాయకులు బండ యాదగిరిరెడ్డి, జూకంటి శ్రీశైలం, బిజ్జాల నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు బండ పద్మ, పేర్ని స్వరూప, అనిత, మల్లవరపు అరవింద్, మల్లిగారి రాజు, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పాండు, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం



పల్లా, తాటికొండను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, అక్టోబర్ 31 : పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్త్యాల కిష్టయ్య, తాడెం కృష్ణమూర్తి అన్నారు. జనగామ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్ తాటికొండ రాజయ్యను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్షాలు చేసే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 3,4 తేదీల్లో చేర్యాల పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. సీఎం కేసీఆర్ 10 ఏండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడపగడపకూ తీసుకుపోవాలని సూచించారు.

## మచ్చలేని మనిషిపై హత్యాయత్నమా..?



ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వర్గల్, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని సమాజంలో ప్రతిఒక్కరూ ఖండించాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు అన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం నెంటూర్‌లో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో గెలవలేని వ్యక్తులు ఇలాంటి భౌతికదాడులను ప్రోత్సాహిస్తారని తెలిపారు. రెండుసార్లు మెదక్ ఎంపీగా గెలిచిన ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాక నియోజకవర్గంలో పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక రాజు లాంటి మానవమృగాలు దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యవాదులు జీర్ణించుకోలేని విషయమన్నారు. మచ్చలేని మనిషి కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. సమావేశంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాములు, రజక సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు లింగకిష్టయ్య, పాషా పాల్గొన్నారు.

## 'మల్లన్న' లడ్డూ ధర పెంపునకు నిర్ణయం

చేర్యాల, అక్టోబర్ 31 : కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి లడ్డూ ధరను పెంచేందుకు ఆలయవర్గాలు నిర్ణయించాయి. 100 గ్రాముల లడ్డూ ధర ప్రస్తుతం రూ.20కి విక్రయిస్తున్నారు. తాజా గా 100 గ్రాముల లడ్డూ ధర రూ.25గా నిర్ణయించారు. స్వామివారి అభిషేకం లడ్డూ 400 గ్రాములకు రూ.100గా నిర్ణయించారు. గతంలో అభిషేకం లడ్డూ విక్రయాలు ఉండవి కావు. కేవలం అభిషేకం, కల్యాణం చేసుకునే భక్తులకు ఆలయంలో లడ్డూ అందించేవారు. దేవాలయానికి ఆదాయం సమకూర్చే మార్గాల్లో ఒక్కటైన లడ్డూ ధరను పెంచేందుకు ఆలయవర్గాలు నిర్ణయించాయి. డిసెంబర్ 1 నుంచి పెంచిన లడ్డూ ధరలను అమలు చేస్తామని ఆలయ నోటీసు బోర్డుపై ప్రకటన పొందుపర్చారు. లడ్డూ ధర పెంపు విషయంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు కార్యాలయంలో లఖితపూర్వకంగా తెలియజేయాలని ఈవో బాలాజీ కోరారు.

## నేడు కేంద్ర బృందం రాక

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 31 : ధూళిమిట్ట మండల కేంద్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించేందుకు నేడు కేంద్ర బృందం రానున్నట్లు మద్దూరు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో కేంద్ర బృందం సభ్యులు పలు పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు.

## పల్లా రాజేశ్వర్‌రెడ్డికి దళితుల మద్దతు



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన దళితులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 31 : బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామ దళితులు మద్దతు ప్రకటించారు. మంగళవారం జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎంపీటీసీ నందనబోయిన నర్సింహులు ఆధ్వర్యంలో పలువురు దళితులు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ దళితబంధు కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. అర్హులైన దళితులకు దళితబంధు అందేవిధంగా కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చినట్లు తెలిపారు. జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని దళితులు తెలిపారు.

# రేవంత్‌రెడ్డిని నమ్మితే రావణకాష్టమే..

**బీఆర్ఎస్ నాయకుడు నర్సయ్య పంతులు**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నర్సయ్య పంతులు

చేర్యాల, అక్టోబర్ 31 : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని నమ్మి అధికారం అప్పగిస్తే తెలంగాణ రాష్ట్రం రావణకాష్టం కావడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు వకులాభరణం నర్సయ్యపంతులు, బుడిగె గురువయ్యగౌడ్, కూరపాటి మధు, నాగమల్ల శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించడంతోపాటు దానికి కారణమైన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోట్లాది రుపాయలు తీసుకొని టికెట్లు అమ్ముకుంటున్నాడని, అతనిపై ఈడీ, ఐటీ అధికారులు విచారణ జరపాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు హత్యా రాజకీయాలకు శ్రీకారం చుట్టారని, ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను రెచ్చగొడుతున్న టీపీసీసీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్‌లో అన్నివర్గాలకు సముచిత స్థానం లభిస్తున్నట్లు తెలిపారు. పొన్నాల ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం కోసం క్షేత్ర స్థాయి నుంచి పని చేస్తున్నట్లు తెలిపారు.

## అధికారులు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి బన్సీలాల్

గజ్వేల్, అక్టోబర్ 31 : ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ సూచించారు. మంగళవారం గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో భాగంగా బాలికల ఎడ్యుకేషన్ హబ్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. అధికారులు నిబంధనలు పాటించాలని, అప్పుడే ఎలాంటి ఆటంకాలు చోటు చేసుకోకుండా ఎన్నికలను నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. అధికారులంతా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రాజు పాల్గొన్నారు.

## ఎంఈవోపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 31 : మద్దూరు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం(ఎంఆర్సీ) నిర్వహణ సరిగా లేకపోవడంతో మండల విద్యాశాఖ అధికారి మొగుళ్ల నర్సింహారెడ్డిపై పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయాన్ని బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల విద్యావ్యవస్థకు ఆయువు పట్టుగా నిలిచే ఎంఆర్సీ కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట కలుపు మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందన్నారు.